# ★ యుద్ధకారణం ★

"హితశ్రీ"

రైలు కూత వేసి కదలబోతుండగా, మా పెట్టెలోకి ఓ మాజీ సైనికుడెక్కాడు. అతనికి కుడి చెయ్యిలేదు. రైలు కదిలిన తరువాత తాపీగా సిగరెట్టు ముట్టించి, మా అందరి ముఖాలు ఓసారి కలయచూశాడు. తనకి కుడిచెయ్యి లేదని అందరికీ తెలిసేట్టుగా ఖాకీ కోటుని ఎడమ చేత్తో విప్పి, హేంగర్‌కి తగిలించి యథాస్థానంలో కూర్చున్నాడు.

"మీ కుడిచెయ్యి..." నాకెదురుగా ఉన్న సీటులో కూర్చున్న ఓ లావుపాటి ఆయన మాజీ సైనికుడి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"యుద్ధంలో పోయింది" అన్నాడు మాజీ సైనికుడు నిర్లక్ష్యంగా.

"ఏ ఫ్రంటులో పని చేశారు?"

"బర్మా"

కాసేపటి నిశ్శబ్దం తర్వాత లావాటాయన మళ్లీ అన్నాడు.

"కుడిచెయ్యి లేకపోతే చాలా ఇబ్బందే"

"అవును"

"ప్రతి చిన్నపనికీ పరాయివాళ్ళ సహాయం తప్పనిసరిగా కోరాలిసిన దురవస్థ పట్టిన వాళ్లెంతమంది ఉన్నారో పాపం ఈ యుద్ధాలవల్ల" లావాటాయన సానుభూతిగా అన్నాడు.

"అది దురవస్థే అయినా వాళ్లది గర్వకారణంగా పరిగణిస్తారు: దేశంకోసం మా ప్రాణాల్నయినా అర్పించగల పటిమ, సాహసం మా సైనికులందరికీ ఉంటాయి. దేశాన్ని రక్షించటానికేగదా మేం జీతాలు తీసుకునేది!" మాజీ సైనికుడు గర్వంగా అన్నాడు.

"ఆ మాత్రం ధైర్య సాహసాలు ప్రదర్శించగలగటం ఆశ్చర్య కారణం కాకపోయినా తప్పక గర్వించాలిసిన విషయం."

"అది మా విధ్యుక్తధర్మం. నామటుకు నేను ఎన్నోసార్లు స్వార్థమా? దేశమా? అని తర్కించుకోవాలిసిన సంఘటనల్ని ఎదుర్కొన్నాను. స్వార్థత్యాగం నన్ను ఆకర్షించటమే నా కుడిచెయ్యి పోవటానికి కారణం."

లావాటాయన కుతూహలంగా ముందుకు వంగాడు. అదను చిక్కిన మాజీ సైనికుడు అతి నేర్పుగా తను శత్రువుల్ని ఎలా, ఎక్కడెక్కడ, ఎన్నిసార్లు వంచించిందీ వాళ్ళకి ఎంత నష్టం కలిగించిందీ, తనని తనతోటి సైనికులు ఎలా మెచ్చుకొన్నదీ కథల్లా చెప్పటం ప్రారంభించాడు. పెట్టెలో వాళ్లమంతా మాజీ సైనికుడి కథనం ఊబుసుపోకకి వినోదంగా వింటున్నాము. పై బెర్తుమీద పడుకుని నిద్రపోతున్న ఓ దురదృష్టవంతుణ్ణి మినహాయించి, మాజీ సైనికుడు జ్ఞాపకం ఉన్నంతవరకూ చెప్పేసి మిగతా సంఘటనలకోసం మెదడుకు పని కల్పించాడు.

లావాటాయన నిట్టూర్పువిడిచి అన్నాడు. "ఈ యుద్ధాలవల్ల ఎంతమంది ఎన్నివిధాల నష్టపడుతున్నారో ఆలోచిస్తే గుండె తరుక్కుపోతుంది. ఎంతమంది వికలాంగులైపోయి జీవితమంతా దుఃఖించవలసి వొస్తుందో, ఎంతమంది గత ప్రాణుల బంధువులు యావజ్జీవితం విచారించవలసి వొస్తుందో ఆలోచిస్తే - మనిషైనవాడెవడూ యుద్ధాలు ప్రకటించటానికి ముందంజ వెయ్యడు. ప్రపంచంలో క్రమంగా మానవత్వమే నశించిపోతోంది." లావాటాయన ఎదురు సీటులో కూర్చుని శ్రద్ధగా వింటున్న ఓ సన్నగా ఉన్నాయన కదిలిన గుండెగలవాడై అన్నాడు.

"అసలీయుద్ధాలు ఎందుకు వస్తాయంటారు?" లావాటాయన ఓ క్షణం ఆలోచించి అన్నాడు. సరిగా ఆలోచిస్తే చాలా కారణాలుంటాయి. ఆర్థిక పరిస్థితులూ, పెరిగే జనసంఖ్యా అసలు కారణాలు అని నా అభిప్రాయం."

"కాదు." సన్నగా ఉన్నాయన నిశ్చితంగా అన్నాడు.

"ఏమిటికాదు?" అన్నాడు లావాటాయన కొంచం చిరాకుతో.

"మీరు చెప్పిన కారణాలు కావు. అసలు కారణం, నరనరాల్లో జీర్ణించిపోయిన సామ్రాజ్యతత్వం."

"అదికూడా ఒక కారణం కావొచ్చు; కాని నేను చెప్పిన కారణాలే ముఖ్యం."

"నాకలా తోచటం లేదు."

"మీకూ తోచక పోవచ్చు. కాని నిజం మీరు కాదనలేరు. ఉదాహరణకి ఓ దేశంలో జనసంఖ్య విపరీతంగా పెరిగి పోయిందనుకోండి. పెరిగే జనసంఖ్యకి స్థలం చూపించేందుకు తక్కువ జన సంఖ్య ఉన్న దేశంవైపు దృష్టి మళ్ళటం సహజం. వలస వెళ్లటమూ, తర్వాత స్థిరపడటమూ. అడ్డుచెబితే యుద్ధం ప్రకటించడమూ మనం చదువుకో లేదా?"

"దాన్ని కారణం అంటానికి వీల్లేదు. మీరు చెప్పింది కేవలం ఒక నెపం. దురాక్రమణను సమర్థించటం కోసం చెప్పబడే కుంటి కారణం."

"ఎంతమాత్రం కాదు. నేను చెప్పింది సరైన కారణం కాదని మీరనలేరు."

"కాదనే నే నంటున్నాను"

"కుతర్కం వల్ల ప్రయోజనం శూన్యం. జన సంఖ్య పెరిగితే ఆర్థిక పరిస్థితులు చిక్కు కలిగిస్తాయి. తమ దేశప్రజల మేలుకోసం పరాయి దేశం ఆక్రమించటానికి ప్రయత్నిస్తారు."

"ఆర్థిక పరిస్థితులు మరోవిధంగా చక్కబరచుకోటానికి వాళ్లకిష్టం లేదనే మీ అభిప్రాయం?"

"అది కాదు. మిగతావాటికంటే ఇది అభిలషణీయమైందని, యుద్ధం ప్రకటించే వాళ్ల అభిప్రాయమయి ఉంటుందని చెబుతున్నాను."

"మీరు పొరపడుతున్నారు. యుద్ధం ప్రకటించటం కేవలం సామ్రాజ్యాన్ని విస్తృతపరుచుకోటం కోసం. మిగతా దేశాలపై తమ ఆధిపత్యం స్థిరపరచుకోటం కోసం. ఇంతకి మినహా మరో కారణం ఉండటం అసంభవం. యుద్ధం ప్రకటించేది ఎప్పుడూ బలవంతమైన రాజ్యమే. మీరు కాదంటే ఏం లాభం?"

లావాటాయనకి ఉక్రోషం వొచ్చింది. తను చెప్పేది రైటని తనకి గట్టినమ్మకం ఉంది. ఈ సన్న మనిషెవడో కాదని దబాయిస్తాడేం? స్వతహాగా తెలుసుకో లేకపోతే ఎదటివాడు చెప్పినప్పుడైనా గ్రహించవొద్దూ? కోపంతో అన్నాడు. "అయితే ఇంతకీ మీరనేదేమిటి?"

"యుద్ధకారణాలు నేను చెప్పినవేగాని మీరు భావించినవి కావు. మీ రనవసరంగా కోపం తెప్పించుకుని ఎలాగైనా మీదే రైటని వాదించటానికి పూనుకోవద్దని మనవి."

"నాకంటే మీకు బాగా తెలుసు కాబోలు."

"ఈ విషయంలో నాకే బాగా తెలుసని నా అభిప్రాయం."

"నేను చెప్పింది తప్పన్నవాడు ఇంతవరకు పృథ్విలో ఎవడూ కనపడలేదు. నేటికి నువ్వొచ్చావు మహా-తెలిసినవాడివి!"

"అలాగా?"

"అవును."

"ఓహో!"

"ఏం కాక?" లావాటాయన దబాయించాడు.

"లావుగా ఉన్నావని అంత ధూమడు మంచిది కాదు."

సన్నని మనిషి చెంప ఛెళ్లుమన్నది. బుగ్గమీద చెయ్యి పెట్టుకుని అతను సత్తువకొద్దీ లావాటాయన వీపుమీద గుద్దాడు. మరుక్షణంలో ఇద్దరూ కుస్తీ ప్రారంభించారు. పక్కన ఉన్న పెద్ద మనుష్యులు వాళ్ళని సర్దటం మొదలు పెట్టారు. లావాటాయన వైపు కొంతమందీ సన్నగా ఉన్నాయన వైపు కొంతమందీ చేరి, ఒకళ్ళది తప్పంటే మరొకళ్ళది తప్పని మాటల పోట్లాట సాగించారు. ఈ సంరంభం అంతా విని-మేలుకొన్న పై బెర్తుమీది పెద్దమనిషి నావైపు చూసి "ఏమిటండీ ఈగోల?" అన్నాడు.

"ఆ-ఏదో యుద్ధ కారణంమీద అభిప్రాయ భేదం వొచ్చింది లెండి. అంతకంటె ఏమీ లేదు" అన్నాను.

ఆ పెద్దమనిషి సాలోచనుడై "ఇంతకీ యుద్ధాలెందుకు వొస్తాయంటారు?" అన్నాడు. నాకు కారణం తెలిసింది. చెపుదామా వొద్దా అని సందేహిస్తుంటే ఆయనే అన్నాడు. "పక్క దేశం వాళ్ళని జయించివాళ్ళ అజ్ఞానాన్ని పోగొట్టి, ఆ దేశంలో సరైన ప్రజావ్యవస్థ నెలకొల్పటమే నేమో!"

కాదని నాకు గట్టి నమ్మకం ఉంది. కాని ఆ పెద్దమనిషి నాలాంటివాళ్లనిఇద్దరి ముగ్గుర్ని ఎడంచేత్తో అమాంతంగా ఆకాశంలోకి విసిరేయగల దృఢకాయుడు. అంచేత ఎందుకైనా మంచిదని తల నిలువుగా ఆడించి, ఓ చిరునవ్వు నవ్వేను. ప్రత్యుత్తరంగా రైలు గొల్లున నవ్వింది.